సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి
- వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ



కొల్లిపరలో కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి

కొల్లిపర: అర్హతే ప్రామాణికంగా తీసుకుని కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పింఛన్ల వారోత్సవ సభ నిర్వహించారు.

సభ అధ్యక్షత ఎంపీడీఓ పి.శ్రీనివాసులు వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే శివకుమార్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఈనెలలో కొల్లిపర మండలంలో నూతనంగా 293 మందికి పింఛన్ ఇవ్వటం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 37వేల మందికి పింఛన్ ఇస్తున్నట్లు వారికి ప్రతి నెల రూ.9.80కోట్లు ఇస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం నియోజకవర్గంలో 23వేల మందికి మాత్రమే పింఛన్ ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా అర్హత పొందిన 293 మందికి మాజీ ఎంపీ వేణుగోపాలరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శివకుమార్ పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచి పిల్లి రాధిక, పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు కేసని శ్రీలత, చిలువూరి ఝాన్సీ, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు అద్దంకి బోసుబాబు, అవుతు పోతిరెడ్డి, వున్నవ ప్రభాకర్, చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.నాంచారయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా గ్రామ నాయకులు, వృద్ధులు పాల్గొన్నారు.

పేదల జీవితాలకు భరోసా..

తెనాలిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుక రూపంలో అందిస్తున్న నగదు ఎందరో పేదల జీవితాలకు భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కొత్తగా మంజూరు అయిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో వింతతు, వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు 391 మందికి మంజూరు అయినట్లు చెప్పారు. ప్రభుత్వం రూ.2500 నుంచి రూ.2750 వరకు పెంచిన పింఛన్లను ఈ నెల నుంచే అందజేస్తున్నట్లు చెప్పారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం పేదలకు న్యాయం చేయడంలో వెనుకడటం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. వివిధ గ్రామాల చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శివకుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీడీవో ఎల్.విజయాలక్ష్మణ్, తహశీల్దార్ కె.రవిబాబు, ఎంపీటీసీలు ధర్మరాజుల చెన్నకేశవులు, మైలా భాను ప్రసాద్, సర్పంచ్‌లు ధూళిపాళ్ల పవన్‌కుమార్, షేక్ బాషా, చందు శాంతికుమార్, పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదరావూరులో ...

రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని రెడ్డిపాలెం, చిన్న దళితవాడ, పెద్ద దళితవాడ, బీసీ కాలనీలతో పాటు పలు సెంటర్లలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కాకి రమాదేవి, మనోజ్, ఎంపీటీసీలు రావూరి యేసుదాసు, గౌరికపూడి బాలరాజు, రావూరి విజయ్, పంచాయతీ కార్యదర్శి కె.రామసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాటక కళాకారుడు సంజీవరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం బ్రహ్మర్షి విశ్వామిత్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం తాతమ్మకల చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక, టెలిఫిల్మ్ కళాకారుడు మేరుగ సంజీవరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కల్లు రాజా, వంశీ, ప్రదీప్, కలకొండ యేసురాజు, శెట్టి సిద్దార్థ, దాసరి బాలస్వామి, ప్రసన్న కుమార్, కనపర్తి బాబురావు, గరికపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు ప్రసాద్ మృతి తీరనిలోటు



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త కేవీబీఎస్‌వీ ప్రసాద్ సంస్మరణ సభను గురువారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో నిర్వహించారు. పౌరాణిక నాటకరంగంలో కర్ణుడు, దుర్యోధనుడు వంటి పాత్రలకు పెట్టింది పేరైన ప్రసాద్ మరణం తీరని లోటని వక్తలు తమ ప్రసంగాల్లో చెప్పారు. మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటైన సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళారంగ ప్రముఖులు టీవీఎస్ శాస్త్రి, అర్ అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య, గరికపాటి సుబ్బారావు, కన్నెగంటి మధు, దేవిశెట్టి కృష్ణారావు, బొల్లిముంత కృష్ణ, నల్లూరి శ్రీనివాసరావు, గంజి ప్రసాద్, ములుకుట్ల విశ్వనాధశర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం విశిష్టమైందని శ్రీసాయిప్రసాదం సేవాసమితి వ్యవస్థాపకుడు, విశ్రాంత బ్యాంకు అధికారి సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి నెల చేపడుతున్న అన్నదానాన్ని గురువారం మధ్యాహ్నం 18వ వార్డులోని జెండా చెట్టు వద్ద చేపట్టారు. అన్నదానాన్ని సాయి లక్కరాజు ప్రారంభించారు. వార్డు కౌన్సిలరు అన్సారీ గౌస్ మాట్లాడుతూ ప్రతినెల మొదటి గురువారం క్రమంతప్పకుండా అన్నదానం చేస్తున్న సంస్థను అభినందించారు. 101 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సమితి సభ్యులు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కోటేశ్వరరావు, సత్యప్రకాష్, ఫణి మాధవరావు, రొంపిచర్ల సురేష్, విమల్, అఖిల్ పాల్గొన్నారు.

స్కూల్ ఎదుట పేరేంట్స్ కమిటీ ధర్నా

తెనాలిఅర్బన్: ఇద్దరు ఉపాధ్యాయులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించటంతో పాటు విద్యార్థుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మారుస్తున్నారని ఆరోపిస్తు తెనాలి ఒకటో వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెద్దేటి సురేంద్ర ఆధ్వర్యంలో పాఠశాల పేరేంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల ముందు ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న తెనాలి మండల విద్యాధికారి అక్కడికి వచ్చి ఇద్దరు టీచర్‌లపై ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమేనని తెలిపారు. ఒక టీచర్‌ను గుంటూరు డీఈఓకు సరెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో టీచర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బాలల పరిరక్షణపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌ప్రాంతంలోని నులకపేటలోని మారుతీ మహిళా సొసైటీ సభ్యులకు బాలల పరిరక్షణపై గురువారం నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్న బాలలను పరిరక్షించాలని, వారికి రక్షణగా ఉండాలని అన్నారు. బాలలను తిట్టడం, కొట్టడం, మానసికంగా వేధించడం చేయకూడదని, అలా చేస్తే వారు మానసికంగా కుంగుబాటుకు గురవుతారని వివరించారు. బాలల పట్ల లైంగిక వేధింపులు లాంటి సంఘటనలు జరగకుండా చూడాలని, అలాంటి సంఘటనలు మీకు తెలిసినా, చూసినా పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు. బాలలు, యువత ముందు సిగరెట్, మందు, గంజాయి మొదలైన మత్తు పదార్థాలను సేవించరాదని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని బయటకు తీసుకు రావడానికి డీ ఎడిక్షన్ చికిత్స అందుబాటులో ఉందని, మీకు ఎవరైనా అలాంటివారు ఎదురైతే 9490492020కు సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, మారుతీ మహిళా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ బి.గిరిజ తదితరులు పాల్గొన్నారు.

7న బీసీ హక్కుల చైతన్య ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

తెనాలిటౌన్: బీసీ హక్కుల కోసం ఈ నెల 7న పట్టణంలో చైతన్య ర్యాలీని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నాయకులు గురువారం తెలిపారు. డివిజన్ గౌడ సంఘ కార్యాలయంలో గురువారం ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీల జనాభా గణన లెక్కలు తేల్చకుండా కేంద్రం బీసీలను అయోమయ పరిస్థితిలో పడవేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 7వ తేదీన మార్కెట్ యార్డు నుంచి చినరావూరు పార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు చైతన్య ర్యాలీ జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

పినపాటి ఐజక్ జీవితం ఆదర్శనీయం



పాస్టర్ ఐజక్ అందించిన సేవలను వివరిస్తున్న బిషప్ పినపాటి జాన్‌పాల్

తెనాలిరూరల్: నీతి మంతులను జ్ఞాపకం చేసుకోవడం ఆశీర్వాదకరం అని బైబిల్ గ్రంథం చెబుతోందని, యదార్థవంతంగా దేవుని సేవ చేసిన మహనీయుడు పినపాటి ఐజక్‌ను స్మరించుకోవడమూ ఆశీర్వాదకరమని పలువురు పాస్టర్లు పేర్కొన్నారు. పట్టణ మోరిస్‌పేటకు చెందిన పాస్టర్ పినపాటి ఐజక్ ప్రథమ జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా రాక్ గాస్పల్ చర్చ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెనాలి, వివిధ ప్రాంతాలకు చెందిన పాస్టర్లు, సంఘస్తులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. వివాహం కూడా చేసుకోకుండా పూర్తిస్థాయి జీవితాన్ని దేవునికి అంకితం చేసి సువార్తను ప్రకటించిన ఐజక్ అందరికీ ఆదర్శనీయుడని అన్నారు. శిఖాపల్లి జయరాజ్, ఈవూరి శ్రీనివాసరావు, ఆరె దానియేలు, ఈవూరి భారతి తదితర సంఘస్తులు పాస్టర్ ఐజక్ తమకు అందించిన ఆత్మీయ మేలుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెనాలి టౌన్ పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ పినపాటి జాన్‌పాల్ తన సోదరుడు చేసిన సేవలను, సంఘ అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. రెవరెండ్ ఎస్.ఇమ్మానియేల్ దాస్, బిషప్ చిలక జాన్ వరప్రసాద్, బిషప్ పాముల పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, కంపెనీ ప్రతినిధులు

మోతడక(తాడికొండ): బిట్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రంగారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కళాశాలల ప్రణాళిక ప్రకారం ఉపాధి శిక్షణ, వ్యక్తిత్వ తరగతులు నిర్వహించి విద్యార్థులలో అవగాహన పెంపొందించడం ద్వారా ఉద్యోగాలకు ఎంపికలలో సులువుగా అర్హత సాధిస్తున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తోపాటు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వైవీ సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధి కల్పనాధికారి ఎ శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు, కో ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

యర్రబాలెంలో కొండ చిలువ కలకలం



యర్రబాలెంలో స్థానికులు కొట్టి చంపిన కొండ చిలువ

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో కొండ చిలువ కలకలం రేపింది. సుమారు 10 అడుగుల పొడవైన కొండ చిలువ యర్రబాలెం- పెనుమాక రహదారి మార్గంలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో దట్టమైన కంపచెట్లలో నుంచి గురువారం రాత్రి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. రోడ్డుపై నుంచి నివాసాల మధ్యకు వస్తున్న తరుణంలో భయంతో కొండ చిలువను స్థానికులు కొట్టి చంపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టరు

తాడికొండ: లిఫ్ట్ ఇరిగేషన్ పైపులను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తుళ్లూరు సీఐ ఆనందరావు తెలిపారు. వివరాల ప్రకారం.. అమరావతి మండలం మండెపూడి గ్రామానికి చెందిన మందడపు శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌లో తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం గ్రామ శివారులో లిఫ్ట్ ఇరిగేషన్ కోసం వేసిన మూడు సిమెంట్ పైపులను దొంగతనంగా ట్రాక్టరులో తరలిస్తున్నాడు. అబ్బరాజుపాలెం గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సోమేశ్వరరావు తమ సిబ్బంది సాయంతో ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టరును సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ తన బావమరిది జొన్నలగడ్డ రమేష్ సాయంతో దొండపాడు గ్రామానికి చెందిన సీతారామయ్య డ్రైవర్ మీరాకి చెందిన జేసీబీతో పైపులను ట్రాక్టరులో వేసి తరలిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. మూడు సిమెంటు పైపుల విలువ రూ.15 వేల వరకు ఉంటుందని, ఈ కేసులో జేసీబీని సీజ్ చేయడంతోపాటు మరో నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఓటర్ల జాబితాల ప్రదర్శన

మంగళగిరి: నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలు ప్రదర్శించినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ హేమమాలిని తెలిపారు. గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు.

ఆమె మాట్లాడుతూ నగర పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం జరిగిందని, ఓటు హక్కు పొందని వారు అందరూ ఓటు హక్కు పొందేలా నమోదు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు కలిగిన వారు మార్పులు–చేర్పులు ఉంటే సంబంధిత బీఎల్‌ఓ వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీఓ వెంకటేశ్వరరెడ్డితో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

భావనారుషిస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: పాత మంగళగిరిలోని శ్రీ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం కల్యాణ మండపంలో వేంచేసియున్న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికలను, నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆవిష్కరించారు. భావనారుషి స్వామి వారికి ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, పార్టీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, పద్మశాలీయ బహుత్తమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన గ్యారా ప్రేమ్‌కుమార్ అలియాస్ చంటి (37) పెయింటర్‌గా జీవిస్తుంటాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో కలహాలు ఏర్పడటంతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు తెలపగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని తండ్రి ప్రకాశరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సీఎం జగన్ పాలనలో అంతటా సంతోషం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ఆరో వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సీఎం జగన్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రతిపక్షాలు మాత్రం బాధతో ఉన్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆరో వార్డు కవిరాజ పార్కు నుంచి గురువారం ఉదయం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ఆరోవార్డు ఇన్‌ఛార్జ్‌లు పోతిరెడ్డి హేమలత, పోతిరెడ్డి నాగరాజు, నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని చూడలేక ప్రతిపక్ష పార్టీలు కుయుక్తులు పన్నుతూ అల్లర్లు, ఆందోళనలకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడులేని విధంగా పెద్దఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సంక్షేమ ఫలాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. తెనాలి నియోజవర్గంలో గత ప్రభుత్వం 23వేల పింఛన్‌లు ఇవ్వగా తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని 37వేలకు పెంచామని చెప్పారు. డిసెంబర్‌లో వాటితో పాటు మరో 1500 వరకు పెరిగాయన్నారు. వీటి కోసం సుమారు రూ.10కోట్లు నిధులు ప్రతినెల వెచ్చిస్తున్నట్లు వివరించారు. ఆరో వార్డు ప్రజలు తెలియజేసిన గ్రీవెన్స్‌ను రానున్న రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. కొన్ని రోడ్లు పల్లంగా ఉన్నాయని, వాటి ఎత్తు పెంచాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. వాటిన్నింటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్‌లు షేక్ దుబాయ్ బాబు, యాతాటి అనీల్, మల్లిబోయిన సువర్ణరేఖాదేవి, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, సర్పంచ్‌లు బాషా, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, ఆరో వార్డు నాయకులు కన్నెగంటి గోపయ్య, పోతిరెడ్డి రవీంద్రనాథ్, సీఖేరారెడ్డి, పోతిరెడ్డి శ్రీకర్, వాసు, ఢకా వాసు, రఫీ, షేక్ ఖాదీర్, పోతిరెడ్డి త్రినాథ్, హేమంత్, పోతిరెడ్డి వీరేంద్ర, ప్రతాప్, వైఎస్సార్ సీపీ నాయకులు కాకి దేవసహాయం, బూరెల దుర్గా, తాడిబోయిన పోలురాజు, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, మల్లిబోయిన రాము, కోలా వాసు, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా

జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం: రౌడీషీటర్లు, అనుమానితుల వ్యవహారశైలి, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. పెండింగ్, ముఖ్యమైన కేసుల వివరాలు, లాకప్, కంప్యూటర్ గది, పరిసరాల్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాపర్టీ, మిస్సింగ్, ముఖ్యమైన కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. గొలుసు దొంగతనాలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో నిఘా ఉండాలని చెప్పారు. రాత్రుళ్లు విధులు నిర్వర్తించేటప్పుడు తప్పనిసరిగా వేలిముద్రల యంత్రాన్ని ఉపయోగించాలని ఆదేశించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభ వేళలు, సాయంత్ర వేళల్లో గస్తీ నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహ, ఎస్ఐలు విజయ్‌కుమార్, హనుమంతరావు, సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8న ముగ్గుల పోటీలు



తెనాలి: పట్టణ ఆర్యవైశ్యసంఘం, పట్టణ ఆర్య వైశ్య మహిళా సంఘం, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతి ఉంటుందన్నారు. దేవస్థానంలో గురువారం విలేకరుల సమావేశంలో నిర్వాహకులు వివరాలను వెల్లడించారు. పోటీలో పాల్గొనే మహిళలు ముగ్గులు వేసేందుకు కావాల్సినవి వారే తెచ్చుకోవాలని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, కార్యదర్శి ఆలమూరు పూజ, కోశాధికారి ఆకి గోవర్ధన లక్ష్మి, చుండూరు రాజ్యలక్ష్మి, బొంతల ధనలక్ష్మి, చుండూరు నాగదుర్గ, కొల్ల గురునాథ గుప్తా, ఆతుకూరి పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

తెనాలిలో జైనుల భారీ ర్యాలీ



తెనాలిటౌన్: జార్ఖండ్ రాష్ట్రంలో పవిత్రమైన శిఖర్ జీ ఆలయ పవిత్రతను కాపాడాలని కోరుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ జైనులు పట్టణంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. పురుషులతో పాటు స్త్రీలు, చిన్నారులు కూడా ర్యాలీలో పాల్గొనటం విశేషం. గంగానమ్మపేటలోని జైన్ టెంపుల్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సేవ్ శిఖర్ జీ అంటూ నినాదాలు చేశారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘ నాయకుడు మాట్లాడుతూ 24 మంది తీర్థంకరులలో 20మంది తీర్థంకులు మోక్షం పొందిన జైన్ ఆలయం పై జార్ఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని దుయ్యబట్టారు. తాము ఉపవాసం ఉండి చెప్పులు లేకుండా నడిచి వెళ్లి పవిత్రంగా చూసుకునే జైన్ ఆలయాన్ని టూరిస్ట్ స్పాట్‌గా చేయడం తమను ఎంతో వేధిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జైన్ సంఘీయులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన



తాడేపల్లిరూరల్: నూతక్కి గ్రామంలో అవయవదానంపై కేఎల్‌యూ విద్యార్థులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అవయవదానంపై అవగాహన కల్పించారు. డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ మానవ శరీరంలోని అవయవాలు ఎంతో ప్రాముఖ్యమైనవని అన్నారు. సమాజంలో ఎంతోమందికి అవయవ లోపాలు ఉన్నాయని, చనిపోయిన వారి అవయవాలను దానం చేస్తే ఆ లోటును భర్తీ చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో సాయి విజయ్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య పాల్గొన్నారు.